నమస్తే తెలంగాణ
హనుమకొండ
5 | వరంగల్, బుధవారం 23 అక్టోబర్ 2024 | HANUMAKONDA

ఏఈవోలపై సర్కార్ కత్తి

- నాలుగు జిల్లాల్లో 15 మంది సస్పెన్షన్
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- రైతు బీమా ఇప్పించడంలో జాప్యమంటూ నెపం
- డిజిటల్ సర్వేకు నిరాకరణ వల్లే అని ఏఈవోల ఆరోపణ

మహబూబాబాద్/జయశంకర్ భూపాలపల్లి/ములుగు (నమస్తే తెలంగాణ)/హనుమకొండ సబర్బన్, అక్టోబర్ 22 : వ్యవసాయ విస్తరణాధికారులు(ఏఈవో)లపై సర్కారు కక్ష కట్టినట్లుగా స్పష్టమవుతున్నది. ఉమ్మడి వరంగల్‌లోని నాలుగు జిల్లాల్లో 15మంది ఏఈవోలను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో హనుమకొండ జిల్లా నుంచి ఐదుగురుండగా, కాజీపేట మండలంలో ఇద్దరు, శాయంపేటలో ఇద్దరు, ఐనవోలులో ఒక్కరున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నలుగురు ఏఈవోలను సస్పండ్ చేయగా, మహదేవపూర్‌కు చెందిన ధర్మేందర్, కాటారం మండలంలోని చిదినెపల్లి క్లస్టర్‌కు చెందిన రాజన్న, చింతకానిలో దివ్యజ్యోతి, మహాముత్తారం మండలం స్తంభంపల్లి(పీపీ) క్లస్టర్‌కు చెందిన శివకృష్ణ ఉన్నారు. మహబూబాబాద్ జిల్లాలో బయ్యారం ఏఈవో అఖిల్ కుమార్, గార్ల నుంచి కిరణ్, పెద్దవంగర మండలం వడ్డేకొత్తపల్లి క్లస్టర్‌లో పనిచేసున్న యశస్వినిపై సస్పెన్షన్ వేటు పడింది. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం శంకరాజుపల్లిలో బీ రాజు, వెంకటాపురం(నూగూరు)-1 ఏఈవో శ్యాంకుమార్, వాజేడు మండలంలోని పెద్దగొల్లగూడెం ఏఈవో రాధికను సస్పెండ్ చేశారు.

చిన్నచిన్న కారణాలతో సస్పెన్షన్

ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన డీసీఎస్ (డిజిటల్ క్రాప్ సర్వే)ను ఎలాంటి సహాయకులు లేకుండా చేయాలని ఏఈవోలపై ప్రభుత్వం ఒత్తిడి తీసుకొస్తున్నది. ఈ క్రమంలో రెండు నెలలుగా ఏఈవోల సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేసి వినతిపత్రాలను అందించారు. ఇదేకాకుండా ఇటీవల హైదరాబాద్‌లో 2,500 మంది ఏఈవోలు ఆత్మీయ సమ్మేళనం పేరిట సమావేశాన్ని ఏర్పాటు చేసుకుని డీసీఎస్ ప్రక్రియను ఎట్టి పరిస్థితుల్లో చేసేది లేదని తీర్మానించుకున్నట్లు సమాచారం. ఇంటలిజెన్స్ వ్యవస్థ ద్వారా విషయాన్ని తెలుసుకున్న ప్రభుత్వ పెద్దలు రాష్ట్రస్థాయిలో కొంతమందిపై చర్యలు తీసుకుంటే మిగతా వారు దారిలోకి వస్తారనే యోచనతో చిన్నచిన్న కారణాలు చూపి సస్పెండ్ చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై ఏఈవోలు తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఏఈవోల సంఘంతో పాటు, ఇతర వ్యవసాయశాఖ అధికారులు సైతం ప్రభుత్వ కక్షపూరిత చర్యగా అభివర్ణిస్తున్నారు. రాష్ట్రంలో సస్పెండ్ చేసిన ఏఈవోల కారణం చూస్తే హాస్యాస్పదంగా ఉంది. చనిపోయిన రైతులకు రైతుబీమా ఇప్పించడంలో వీరు జాప్యం చేసినట్లుగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే వీరిపై సూపర్‌వైజింగ్ అధికారులైన ఏవోలు, ఏడీఏలు, డీఏవోలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ఏఈవోల సంఘం మండిపడుతున్నది. చిన్నస్థాయి ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేసేందుకే సర్కారు ఇలాంటి చర్యలకు పాల్పడుతుందని విచారం వ్యక్తం చేస్తున్నారు.

డమ్మీ పిస్టల్‌తో బెదిరింపులు

- ప్రజా ప్రతిఘటన మాజీ నక్సలైట్ అరెస్టు
- హనుమకొండ జిల్లా ఊరుగొండలో ఘటన
- వివరాలు వెల్లడించిన పరకాల ఏసీపీ కిశోర్‌కుమార్

బెదిరింపులకు పాల్పడ్డ మాజీ నక్సలైట్ వెంకటేశ్వర్లు అరెస్టును చూపెడుతున్న పరకాల ఏసీపీ కిషోర్‌కుమార్

దామెర, అక్టోబర్ 22 : డమ్మీ పిస్టల్‌తో బెదిరింపులకు పాల్పడిన ప్రజా ప్రతిఘటన మాజీ నక్సలైట్‌ను పోలీసులు అరెస్టు చేశారు. హనుమకొండ జిల్లా దామెర పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పరకాల ఏసీపీ కిశోర్‌కుమార్ వివరాలను వెల్లడించారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం పల్లిపాడుకు చెందిన రాయల వెంకటేశ్వర్లు 2006లో ప్రజా ప్రతిఘటనలో కొరియర్‌గా పని చేసి 2007లో లొంగిపోయాడు. ఈ నెల 21న అర్ధరాత్రి 12 గంటల సమయంలో దామెర మండలం ఊరుగొండలో కిరాణా షాపు యజమాని కందికొండ సంపత్‌ను నిద్రలేపి డమ్మీ పిస్టల్ (నకిలీ ఎయిర్ గన్) చూపించి తాను మాజీ నక్సలైట్‌నని, డబ్బులివ్వాలని బెదిరించాడు. అతడు లేవని చెప్పడంతో దాడి చేసి కౌంటర్ నుంచి రూ. 2000 తీసుకొని పారిపోయేందుకు యత్నించగా యజమాని గట్టిగా పట్టుకొని కేకలు వేయడంతో చుట్టు పక్కలున్నవారు చేరుకొని పిస్టల్‌ను తీసుకొని 100కు డయల్ చేశారు. అక్కడకు చేరుకున్న పోలీసులు వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకొని పిస్టల్‌ను స్వాధీనం చేసుకున్నారు.

సంపత్ ఫిర్యాదు మేరకు వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. సమావేశంలో పరకాల రూరల్ సీఐ రంజిత్‌రావు, ఎస్సై కొంక అశోక్ పాల్గొన్నారు.

నగరంపై మంచుదుప్పటి

వరంగల్ నగరాన్ని మంచు దుప్పటి కప్పేసింది. మంగళవారం ఉదయం 7.30 గంటలు దాటినా సూర్యుడు పొగ మంచును దాటి బయటకు రాలేదు. హనుమకొండలోని వంగపహాడ్-రెడ్డిపురం ఓఆర్ఆర్‌పై దారి కన్పించకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. లైట్లు వేసుకొని ప్రయాణించారు.
– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ

ఉపాధిలో పూడిక పనుల్లేవ..

ఇక ఫీల్డ్, ఫీడర్ చానల్స్, మట్టి రోడ్లే దిక్కు
పండ్ల తోటలు, ఫాంపాండ్లకూ ప్రాధాన్యత
గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి అందిన ఆదేశాలు

వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి అమలు

- వరి, పత్తి పంటలవైపే మొగ్గు చూపుతున్న రైతులు
- కష్టంగా మారుతున్న కూలీలకు పని దినాల కల్పన
- క్షేత్రస్థాయిలో పనులను గుర్తిస్తున్న అధికారులు

శాయంపేట, అక్టోబర్ 22 : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఇకనుంచి పూడిక పనులుండవు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో చెరువులు, కుంటల్లో పూడిక పనులు చేపట్టొద్దని డీఆర్డీఏ అధికారులు సూచనలు జారీ చేశారు. ఈ క్రమంలో కూలీలకు అధిక పని దినాలు కల్పిస్తున్న ఈ పనులను ఎత్తేయడంతో తీవ్ర ప్రభావం పడుతుందని కింది స్థాయి అధికారులు చెబుతున్నారు. 2025-26లో అమలు చేసే పనుల విషయమై క్షేత్ర స్థాయిలో లేబర్ బడ్జెట్, ఉపాధి ప్రణాళిక తయారీలో అధికారులు నిమగ్నమయ్యారు. గ్రామాలకు వెళ్లి సర్వే చేస్తున్నారు. ఇప్పటి వరకు ఉపాధిలో 256 పనులను గుర్తించే వీలున్నది. అయితే గ్రామాల్లోని కూలీలు చెరువులు, కుంటల్లో పూడికతీత పనులకే పెద్ద సంఖ్యలో వస్తున్నారు. పని దినాల టార్గెట్ చేరాలంటే ఈ పనులే చేయాల్సి ఉంటుంది. తాజాగా వచ్చే ఆర్థిక సంవత్సరంలో పూడిక పనులుండవని, గ్రామ స్థాయిలో ఉన్న పనులతో ప్రణాళికలు తయారు చేయాలని గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ఆదేశించినట్లు శాయంపేట మండల ఈజీఎస్ ఏపీవో అనిత చెప్పారు. గతంలో పనులు జరిగిన చెరువుల్లో మూడేళ్ల వరకు పూడిక పనులు చేపట్టొద్దని సూచించినట్లు తెలిపారు. దీంతో ఎప్పటిలాగే గ్రామాల్లో ఫీల్డ్, ఫీడర్ చానల్స్, మట్టి రోడ్ల పనులను గుర్తిస్తున్నారు. అలాగే చెక్‌డ్యామ్‌ల వద్ద పేరుకుపోయిన మట్టి తొలగింపు పనులు చేపట్టేందుకు అనుమతిచ్చారు. ఎస్సారెస్పీ కాల్వల్లో జంగిల్ క్లియరెన్స్, డీసిల్టింగ్ పనులు గుర్తిస్తున్నారు. అయితే వీటిల్లో పెద్ద ఎత్తున పూడిక ఉండటంతో పనులు చేపట్టాలా? వద్దా? అనే అయోమయంలో పడుతున్నారు.

పనిదినాల కల్పన కష్టమే..

ఫీడర్ చానల్‌ను మూడు కిలోమీటర్లకు ఎస్టిమేట్ వేస్తే 500 పనిదినాలు వస్తాయి. పెద్ద గ్రామాల్లో రోజుకు 800 మందికిపైగా కూలీలు పనికి వస్తుండడంతో అవి రెండు రోజులకు సరిపోవు. కూలీలకు రోజుకు రూ.300 చెల్లించాలని నిర్దేశించినప్పటికీ దాదాపు రూ. 215 వరకు పొందుతున్నారు. ఈ నేపథ్యంలో వచ్చే ఆర్థిక సంవత్సరానికి పని దినాలు కల్పించడం కష్టంగా మారిందన్న అభిప్రాయాన్ని అధికారులు వ్యక్తం చేస్తున్నారు. ఫాంపాండ్స్, చేపల చెరువుల పనులు చేపట్టాలని సూచిస్తున్నప్పటికీ చిన్న కమతాలు కావడంతో రైతులు ముందుకు రావడం లేదు. ఫాంపాండ్ 12 మీటర్లకు తక్కువ ఉండొద్దని నిర్దేశించడంతో దాదాపు ఐదు గుంటల భూమిని నీటికోసం వదులుతారా అన్న సందేహాలున్నాయి. శాయంపేట మండలంలో 10 వేల మంది జాబ్ కార్డులున్నవారు ఉన్నారని, వీరిలో ఆరు వేల మందికి పైగా పనుల్లోకి వస్తున్నారని, మొత్తం రెండున్నర లక్షల పని దినాలకు ప్రణాళిక తయారు చేయాల్సి ఉందని ఏపీవో తెలిపారు. నవంబర్ 28 వరకు ప్రణాళికలను పూర్తి చేసి అధికారులకు పంపిస్తామని చెప్పారు.

శాయంపేట : ఉపాధిలో చేపట్టే పనులపై సర్వే చేస్తున్న సిబ్బంది, అధికారులు

గ్రామ సభల్లో తీర్మానం..

గ్రామసభ తీర్మానంతో ఎస్టిమేట్ తయారు చేసి పనులు చేయాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. దీంతోపాటు హార్టికల్చర్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని సూచిస్తున్నారు. మామిడి, జామ, సపోట, సీతాఫలం తోటలకు మూడేళ్ల వరకు నిర్వహణ ఖర్చులు ఇవ్వాలని నిర్ణయించారు. ఐదెకరాలకు ఖర్చు కింద చెట్టుకు రూ. 15 ఇస్తారు. తోటలను బట్టి ఎస్టిమేట్ వేస్తున్నారు. ఇక నుంచి ఒక్కో రైతు రెండు రకాల తోటలు వేసుకున్నా డబ్బులిచ్చేలా ఆదేశించారు. తోటల పెంపకంలో జాబ్ కార్డు ఉన్న రైతులకు ప్రోత్సాహం ఇస్తారు. గతంకంటే టార్గెట్‌ను పెంచి తద్వారా కూలీలకు పనులు కల్పించేలా నిర్దేశించారు. అయితే పత్తి, వరి తదితర పంటలకే రైతులు ప్రాధాన్యత ఇస్తుండటంతో కూలీలకు పనుల కల్పన ఎలా? అని అధికారులు తర్జనభర్జన పడుతున్నారు.

జీవో 29ని వెంటనే రద్దు చేయాలి

- బీసీ పొలిటికల్ జాక్ ఆధ్వర్యంలో ఆందోళన
- అంబేద్కర్ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలు, ప్లకార్డులతో నిరసన
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు

హనుమకొండలోని అంబేద్కర్ జంక్షన్ వద్ద ధర్నా చేస్తున్న బీసీ పొలిటికల్ జాక్

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 22 : జీవో 29ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బీసీ పొలిటికల్ జాక్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. నల్లబ్యాడ్జీలు ధరించి ప్లకార్డులతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీసీ పొలిటికల్ జాక్ చైర్మన్ సుందర్‌రాజ్‌యాదవ్, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం నేతలు ప్రొఫెసర్ గడ్డం భాస్కర్, డాక్టర్ కాళీప్రసాద్, డాక్టర్ లక్ష్మీప్రసాద్, పూలే యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ తాడిశెట్టి క్రాంతికుమార్, ఆలిండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్, బీసీ నాయకులు పులి రజనీకాంత్ పాల్గొని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సుందర్‌రాజ్ యాదవ్ మాట్లాడుతూ జీవో 29ను ప్రభుత్వం దురద్దేశపూర్వకంగా తీసుకువచ్చిందని, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అన్యాయం జరుగుతున్నదన్నారు. తెలంగాణ ఉద్యమానికి వరంగల్ ఎలా కేంద్రమైందో అదే తరహాలో ఇక్కడి నుంచి మరో బీసీ ఉద్యమం ఉద్భవిస్తుందన్నారు. ప్రభుత్వ విధానాలు ఇలాగే ఉంటే వేలాదిమంది బీసీలు ప్రభుత్వంపై దండెత్తాల్సిన అవసరం వస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కామారెడ్డి డిక్లరేషన్‌తో సహా ఉద్యోగ నియామకాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అభ్యర్థులకు ప్రభుత్వం సింహభాగం కేటాయించాలని డిమాండ్ చేశారు. పూలే యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ తాడిశెట్టి క్రాంతికుమార్ మాట్లాడుతూ కేవలం అగ్రవర్ణాలకు లాభం చేకూర్చే విధంగా జీవో 29 ఉందన్నారు. దీని ద్వారా 560 పోస్టులకు 210 కేవలం అగ్రవర్ణాలకు మాత్రమే కేటాయించేలా ఉందని, వెంటనే జీవో 29 రద్దు చేసి జీవో 55ని అమలు చేయాలన్నారు. నిరసన సందర్భంగా లాఠీ దెబ్బలు తిన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ నాయకులు, విద్యార్థులు పరీక్షలకు హాజరుకాలేకపోయారని, మానవతా కోణంలో ఆలోచించి సుప్రీంకోర్టు, రాష్ట్ర ప్రభుత్వం మరోసారి పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు.

రెండు సెలెక్ట్.. ఒకటి రిజెక్ట్..

ఎనుమాముల మార్కెట్‌లో సీసీఐ తీరిది

- 112 వాహనాల్లో విక్రయానికి లూజు పత్తి రాక
- 111 కొనుగోలు చేసిన ప్రైవేట్ వ్యాపారులు
- మద్దతు దక్కక అన్నదాత ఆందోళన
- ప్రారంభంలోనే ఉసూరుమంటున్న రైతులు

మార్కెట్‌కు వచ్చిన పత్తి బస్తాలు

కాశీబుగ్గ, అక్టోబర్ 22 : వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు మంగళవారం 112 వాహనాల్లో లూజు పత్తి రాగా, అందులో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) రెండింటిని సెలెక్ట్ చేసింది. తేమ అధికంగా ఉందని ఒక వాహనాన్ని రిజెక్ట్ చేసింది. మంత్రి కొండా సురేఖ సోమవారం అట్టహాసంగా ప్రారంభించిన సీసీఐ కొనుగోలు కేంద్రం తీరుతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మార్కెట్‌కు పెద్ద మొత్తంలో వచ్చిన పత్తిని తేమ, నాణ్యత పేరుతో సీసీఐ అధికారులు కొర్రీలు పెట్టడంతో ప్రైవేట్ వ్యాపారులే కొనుగోలు చేశారు. దీంతో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర దక్కక ప్రారంభంలోనే ఉసూరుమంటున్నారు. పెట్టిన పెట్టుబడులు రాక అప్పుల పాలయ్యే పరిస్థితి నెలకొందని రైతులు భోరున విలపిస్తున్నారు. అకాల వర్షాలతో దిగుబడి తగ్గడంతో పాటు గిట్టుబాటు ధర దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం మార్కెట్‌కు 5,795 పత్తి బస్తాలతో పాటు 112 వాహనాల్లో లూజు పత్తి వచ్చింది. కేంద్ర ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ.7,521తో సీసీఐ అధికారులు రెండు వాహనాలను ఎంపిక చేశారు. మిల్లులకు వెళ్లిన తరువాత నాణ్యత లేదని, తేమ అధికంగా ఉందని ఒక దానిని రిజెక్ట్ చేశారు. సీసీఐ క్వింటాకు రూ.7,370.58తో కొనుగోళ్లు చేపట్టగా, వ్యాపారులు గరిష్ఠంగా క్వింటాలుకు రూ.7,010, మధ్యరకంగా రూ. 6,500, కనిష్ఠంగా రూ.6 వేల ధరతో కొనుగోలు చేశారు. ఈ నెలలో ఇప్పటి వరకు 40,318 క్వింటాళ్ల పత్తి రాగా మద్దతు ధరతో సీసీఐ 32.15 క్వింటాళ్లు కొనుగోలు చేసినట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి.

బయోమెట్రిక్ యంత్రాలు దొంగిలించబడిన ప్రాంతం

ఎంజీఎంలో బయోమెట్రిక్ యంత్రాలు మాయం

- పోలీసులకు ఫిర్యాదు చేసిన ఆర్ఎంవో
- సీసీ ఫుటేజ్ ఆధారంగా విచారణ చేపడుతున్న పోలీసులు
- మరోమారు బయటపడ్డ భద్రతా లోపాలు

వరంగల్ చౌరస్తా, అక్టోబర్ 22: ఎంజీఎం భద్రతా చర్యల్లో డొల్లతనం మరోమారు బయటపడింది. నిత్యం వేల మంది వైద్య సేవల కోసం వచ్చే దవాఖానలో కట్టుదిట్టంగా ఉండాల్సిన భద్రతా లోపం రోగులు, అటెండెంట్లకు ఆందోళన కలిగిస్తున్నది. ఎంజీఎం, నర్సింగ్, పారా మెడికల్ సిబ్బంది హాజరు నమోదు చేసే బయోమెట్రిక్ యంత్రాలు రెండు సోమవారం సాయంత్రం మాయమయ్యాయి. రాత్రి విధులకు హాజరైన సిబ్బంది గుర్తించి భద్రతా సిబ్బంది, వైద్యాధికారులకు సమాచారం అందించారు. దీంతో ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చిలుక మురళి ఆదేశాల మేరకు ఆర్ఎంవో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం ఎంజీఎం చేరుకున్న పోలీసులు సీసీ ఫుటేజ్ ఆధారంగా అనుమానితుడిని గుర్తించి విచారణ చేపట్టారు. ఎంజీఎంలో మూడు షిఫ్టుల్లో ఒక్కో షిఫ్టుకు సుమారు 50 మందికిపైగా సెక్యూరిటీ సిబ్బంది విధులు నిర్వర్తిస్తుంటారు. జనసంచారం ఉన్న ప్రాంతంలోనే దొంగతనం జరగడంతో భద్రతా చర్యలు పర్యవేక్షిస్తున్న కృష్ణా కన్‌స్ట్రక్షన్స్ ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టు సంస్థకు హాస్పిటల్ కమిటీ చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తున్న కలెక్టర్ ఆదేశాల మేరకు మెమో జారీ చేయనున్నట్లు సూపరింటెండెంట్ తెలిపారు.

రోడ్డెక్కిన కానిస్టేబుళ్ల కుటుంబాలు

- రాష్ట్రవ్యాపంగా ఒకే పోలీస్ విధానం ఉండాలని డిమాండ్
- ప్లకార్డులు పట్టుకొని 4వ బెటాలియన్ పోలీసుల భార్యాపిల్లల నిరసన

ధర్నా చేస్తున్న వారిని అడ్డుకుంటున్న మహిళా పోలీసులు

వరంగల్ చౌరస్తా, అక్టోబర్ 22: రాష్ట్రవ్యాప్తంగా ఒకే పోలీస్ విధానం ఉండాలని డిమాండ్ చేస్తూ మామునూరు 4వ బెటాలియన్ కానిస్టేబుళ్ల కుటుంబాలు రోడ్డెక్కాయి. మంగళవారం ఆర్టీవో కార్యాలయం జంక్షన్ నుంచి ప్లకార్డులు పట్టుకొని ర్యాలీగా రంగశాయిపేటకు చేరుకున్న వారిని పోలీసులు అడ్డుకున్నారు. వారు అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వన్ స్టేట్ వన్ కార్డ్ నినాదంతో కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తామని గొప్పలు చెప్పుకుంటున్న రాష్ట్ర ప్ర భుత్వం శాంతిభద్రతలు కాపాడే పోలీస్ వ్యవస్థలో మాత్రం ఏక్ పోలీస్ విధానాన్ని అనుసరించడం లేదన్నారు. రిజర్వ్ పోలీసులకు ప్రత్యేక నిబంధనలు అమలు చేయడం సరికాదని పేర్కొన్నారు. రిజర్వ్ పోలీస్ ఫోర్స్ కానిస్టేబుల్స్ వెట్టి చాకిరీ చేస్తుండడంతో వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వాపోయారు. విధి నిర్వహణ పేరుతో కుటుంబాలకు దూరం చేస్తున్నారని మండిపడ్డారు. దీంతో పాటుగా కనీస సెలవులు సైతం మంజూరు చేయకుండా ఆంక్షలు విధించడంతో కానిస్టేబుళ్లు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని అన్నారు. ఆందోళన విషయం తెలియడంతో అధికారులు మాము నూరు నుంచి ఆర్టీవో కార్యాలయం వరకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా, ఈ నిరసన కార్యక్రమానికి తెలంగాణ ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్ మద్దతు తెలిపారు. తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో అమలవుతున్న ఒకే పోలీస్ విధానాన్ని తెలంగాణలో కూడా అమలు చేయాలన్నారు.

నకిలీ పట్టాల ముఠా గుట్టురట్టు

ములుగు,అక్టోబర్22(నమస్తేతెలంగాణ): నకిలీ పోడు పట్టాల పాస్ పుస్తకాలను తయారు చేసే ముఠాలో అటవీ శాఖ అధికారులు ఆరుగురు వ్యక్తులను సూత్రధారులుగా తేల్చారు. ఈ మేరకు ములుగు ఎఫ్ఆర్వో డోలి శంకర్ వివరాలు వెల్లడించారు. వరంగల్ జిల్లా నర్సంపేట మండలం ముగ్ధంపురానికి చెందిన చందావత్ భద్రు మరో ఐదుగురితో కలిసి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తూ నకిలీ పాస్ పుస్తకాల దందాకు తెరలేపాడు. వరంగల్‌లోని గణేశ్ ప్రింటర్స్‌కు చెందిన తాటి పాముల రాజు కలెక్టర్, డీఎఫ్‌వో, ఐటీడీఏ పీవో సంతకాలను ఫోర్జరీ చేసి ఒక్కో పాస్ పుస్తకం తయారుచేయగా భద్రు రూ. 2500లు ఇచ్చేవాడు. నర్సంపేటకు చెందిన భూక్యా వెంకన్న ఒక్కో పాస్ పుస్తకానికి రూ.2500 తీసుకొని నకిలీ క్యూఆర్ కోడ్, అదే గ్రామానికి చెందిన బానోత్ హరికిషన్ నాయక్ రూ. 2వేలు తీసుకొని ఒక్కో నకిలీ హోలోగ్రామ్ అందించేవాడు. నర్సంపేటలోని ప్రైవేట్ లెక్చరర్ ధరావత్ కిషన్ బ్యాంకు రుణాల మంజూరు కోసం ఫోర్జరీ సంతకాలతో ఎఫ్ఆర్వో ధ్రువీకరణ పత్రాన్ని తయారుచేసేవాడు. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం ఇంచెంచెర్వుపల్లికి చెందిన ఎఫ్ఆర్సీ చైర్మన్ జాటోత్ రాజ్‌కుమార్ అందించిన మాడల్ పట్టా పాస్ పుస్తకంతో నకిలీవి తయారు చేసేవారు. వీరు తయారుచేసిన నకిలీ పాస్ పుస్తకాలను పోరిక రవి, పోరిక దేవేందర్‌కు మూడు చొప్పున, వాంకుడోతు నర్సింహకు ఆరు, ములుగు మండలం కాసిందేవిపేటకు చెందిన వాంకుడోత్ రవికి ఏడు విక్రయించినట్లు భద్రు చెప్పినట్లు ఎఫ్ఆర్వో పేర్కొన్నారు. ఇలాంటి నకిలీ పాస్ పుస్తకాలు మరిన్ని వెలుగులోకి రావాల్సి ఉందని, ఇంకా కొంతమంది వ్యక్తుల ప్రమేయంపై దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం భద్రు, వాంకుడోత్ రవిని అదుపులోకి తీసుకున్నామని, మిగిలిన వారిని త్వరలో పట్టుకొని అటవీ హక్కుల చట్టం ప్రకారం కేసు నమోదు చేస్తామని ఎఫ్ఆర్వో శంకర్ వెల్లడించారు.

సీజ్ చేసిన పటాకులతో టాస్క్‌ఫోర్స్, ఇంతెజార్‌గంజ్ పోలీసులు

పటాకుల దుకాణాలపై టాస్క్‌ఫోర్స్ దాడులు

రూ. 1.80 కోట్ల విలువైన బాణసంచా సీజ్

గిర్మాజీపేట, అక్టోబర్ 22 : దీపావళి పండుగ వేళ పాతబీట్‌బజార్‌లో అక్రమంగా డంప్ చేసిన రూ. 1.8 కోట్ల బాణసంచాను మంగళవారం రాత్రి సీజ్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. ఏసీపీ కథనం ప్రకారం.. జిల్లాలో పటాకుల అక్రమదందా జోరుగా సాగుతుందనే విశ్వసనీనయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ఇంతెజార్‌గంజ్ పోలీసులతో కలిసి బాణసంచా దుకాణాలపై దాడులు చేశారు. పాతబీట్‌బజార్‌లోని వజినేపల్లి రమేశ్, శ్రీసాయి ఫైర్ క్రాకర్స్ షాపుల్లో అనుమతులు లేకుండా అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు రూ. 1.80 కోట్ల బాణసంచాను గుర్తించి సీజ్ చేశారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్, ఇంతెజార్‌గంజ్ ఎస్ఐ వెంకన్న, ఆర్ఎస్ఐ శరత్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.